స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : స్పందనలో అందిన అర్జీలను వేగవంతంగా పరిష్క రించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమ వారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్య క్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుండి అర్జీలను కలెక్టర్ స్వీక రించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను సంబంధిత అదికారులు క్షేత్రస్థాయిలో క్షుణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ జరిపి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. స్పం దనలో వచ్చిన అర్జీలు తిరిగి రీఓపెన్ కాకుండా చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. స్పందనలో అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

చూపించడంతో పాటు నిర్ణీత గడువు లోగా పరిష్క రించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ, మహిళా శిశు సంక్షేమం, మత్స్య శాఖ, పంచా యతీ రాజ్, గృహ నిర్మాణ శాఖ, డ్వామా, మున్సిపల్ కార్పొరేషన్, ఉద్యానవన, దేవదాయ శాఖ, తదితర శాఖలకు సంబంధించిన పలు సమస్యలపై పరిష్కారం కోరుతూ 329 మంది అర్జీదారులు తమ ఫిర్యాదులను అందజేశారు. స్పందన పోర్టల్ లో ఎటువంటి అర్జీలు పెండింగ్ లో లేవని, దీనికి సహకరించిన అధికారులను కలెక్టర్ అభినందించారు. బియాండ్ ఎస్ఎల్ఎలో కొన్ని అర్జీలు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్య మంత్రి పేషి నుండి వచ్చిన స్పందన పెండింగ్లో ఉన్న అర్జీలను రెండు వారాల్లోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్య క్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తో పాటు సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ప్రత్యేక ఉప కలెక్టర్ డా. జి.జయదేవి, జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ పథక సంచాలకులు డి.వి.విద్యా సాగర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఆర్.వెంకట రామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవి కుమార్, జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి.చిట్టిరాజు, మెప్మా పథక సంచాలకులు ఎం.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

జీఓ నెంబర్ 52ను రద్దు చేయాలి

విశాలాంధ్ర - సీతంపేట : జీఓ నెంబర్ 52 ను అమలు చేస్తే గిరిపుత్రులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది అని వెంటనే ఆ జీఓను రద్దుచేయాలని ఏపీ గిరిజన సమాఖ్య శ్రీకాకుళం జిల్లా సమితి సభ్యులు కోరారు. ఈ జీఓ రద్దు చెయ్యాలి అని కోరుతూ సోమవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షులు చాపర సుందర్ లాల్, జిల్లా కార్యదర్శి లండ వెంకటరావు, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సవర హరికృష్ణ ఆధ్వర్యంలో సీతంపేట ఐటీడీఏ పిఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టీల్లో ఇతర కులాలను చేర్చవద్దని కోరారు. పాలకులు తీసుకు వచ్చిన జీఓ 52ను రద్దు చెయ్యాలి అని డిమాండ్ చేశారు. గిరిపుత్రులు సాగుచేస్తున్న భూములకు వారి పేరున పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో గిరిజన సమాఖ్య నాయకులు ఎస్ కేశవ, రమణమ్మ, పెద్దఎత్తున గిరిజనులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' విజయవంతం చేయండి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సి.హెచ్.రవి

విశాలాంధ్ర - పలాస : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, జాతీయ నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని దేశంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం దేశవ్యాప్తంగా చేపడు తున్నామని, దీనిని జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సి.హెచ్.రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కాశీబుగ్గ ఎస్‌బిఎస్‌వైఎం డిగ్రీ కళాశాల సభ్యులతో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం 11 జాతీయ విద్యాసంస్థలను రాష్ట్రంలో ప్రారంభించినా నిధులు కేటాయించకపోవడం వలన మొండి గోడలకే పరిమితమయ్యాయని అన్నారు. ఉపాధి హక్కులను కల్పించేందుకు భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ బిల్లును తీసుకురావడానికి నూతన విద్యావిధానం పేరుతో విద్య కాషాయకరణ కుట్రలను తిప్పి కొట్టేందుకు ఉద్యమిస్తామని అన్నారు. అలాగే ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ కోసం నూతన జాతీయ విద్యావిధానం 2020 బిల్లును రద్దు చేయాలని, తదితర సమస్యల సాధనకోసం చలో పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్నామని, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమం ఎఐఎస్ఎఫ్ నాయకులు మౌనిక, శ్వేత, భార్గవి, లత, సోమేష్, భాస్కర్, కుమార్‌నాయుడులు పాల్గొన్నారు.

ఇంటి బిల్లులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - రేగిడి : ఇల్లు లబ్ధి దారులకు బిల్లులు సకాలం లో అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గన్నవరపు కాశీ విశ్వనాథరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజ నీరింగ్ అసిస్టెంట్లతో సమావేశ నిర్వ హించారు. ఇల్లు నిర్మించిన గృహలబ్ధి దారులకు ఇల్లు నిర్మాణాలు. వేగ వంతం చేయాలన్నారు. జల జీవన పథకం పక్కాగా అమలుచేయాలన్నారు. చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాల పై దృష్టి సారించాలన్నారు. హౌసింగ్ ఏఈ సూర్య ప్రకాష రావు, ఆర్డబ్ల్యూఎస్ జేఈ శ్రీ చరణ్ ఉన్నారు.

క్రీడాభివృద్ధికి సమగ్ర కృషి : మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : విద్యార్థి దశ నుంచే క్రీడాస్ఫూర్తి వెల్లి విరి యాలని మాజీ ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్ పిలుపునిచ్చారు. సోమవారం శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడల పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే చదు వుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత కల్పి స్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకో వలసిన అవసరం నేటి యువతకు ఉందని జిల్లా నుండి అనేక మంది క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో పేరు గడించారని ఆ స్థాయికి వర్ధ మాన క్రీడా కారులు ఎదగాలని కోరారు. ఈ కార్య క్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ రోణంకి జయ ప్రకాష్, జిల్లా విద్యాశాఖ అధికారి పగడాలమ్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ పి.సురేఖ, జిల్లా క్రీడాభి వృద్ధి సంస్థ అధికారి మాధురీ లత, మాజీ మున్సిపల్ చైర్మన్ పద్మావతి, జిల్లా ఒలంపిక్ సంఘ కార్యదర్శి కే.సుందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయసాయిని కలిసిన యువనేత రామ్ మనోహర్ నాయుడు

విశాలాంధ్ర - అరసవల్లి : జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయ సాయిరెడ్డిని ఆ పార్టీ యువనేత ధర్మాన రామ్మనోహర్ నాయుడు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 12 న విశాఖలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా శ్రీకాకుళం నియోజకవర్గంలో జరుగుతున్న ఏర్పాట్లను సాయిరెడ్డికి వివరించారు. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున వైకాపా శ్రేణులు మోడీ పర్యట నకు హాజరు కానున్నారని రామ్మనోహర్నాయుడు స్పష్టం చేశారు యువనేత చేపడుతున్న పార్టీ కార్యక్రమాలను విజయసా యిరెడ్డి ప్రస్తావించి అభినందించారు. ఆయన వెంట ఎం.వి. పవన్కార్తిక్, డాక్టర్ అంకారెడ్డి ప్రసాద్ ఉన్నారు.

కాకినాడ ఆదిత్య కళాశాలలో ఘనంగా సీవీ రామన్ జయంతి

విశాలాంధ్ర - శ్రీకాకుళం : నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా రామన్ ఎఫెక్ట్ సృష్టికర్త సివి రామన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి రామన్ చిత్రపటానికి పూల మాల వేసి అంజలి ఘటించి రామన్ భౌతిక శాస్త్రంలో భారతదేశ ఖ్యాతిని ప్రపంచదేశాలకు తెలిసేటట్లు చేశారన్నారు. నేటి యువత కూడా భౌతికశాస్త్రంలో అనేక పరిశోధనలు చేయాలనీ ఆకాంక్షించారు.కళాశాల ప్రిన్సిపాల్ కె శివ శంకర్ మాట్లాడుతూ రామన్ బోతిక శాస్త్రంలో భారత దేశం నుండి మొదటి నోబెల్ బహుమతి అందుకున్నారని వివరించారు, రామన్ ఎఫెక్ట్ ప్రపంచ దేశాలకు మార్గదర్శం అని విద్యార్థినిలకు తెలిపారు.ఇలాంటి గొప్ప వ్యక్తులను యువత ఆదర్శంగా తీసుకోవాలని చూసించారు.కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకట అప్పారావు, ఫిజిక్స్ విభాగాధిపతి హనుమంతు భాస్కరరావు,ఎన్ఎస్ఎస్ పిఓ డి దామోదరరావు,ఎమ్ శ్రీనివాసరావు, లైబ్రేరియన్ కమల్ కుమార్,రమ్య,విద్యార్థినిలు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానులే

విశాలాంధ్ర - కాశీబుగ్గ : చట్టం దృష్టిలో అందరు సమానులేనని పలాస బార్ సభ్యులు అనిల్‌రాజు, శ్యామ్‌లు అన్నారు. న్యాయ అవగా హన సదస్సులో భాగంగా సోమవారం పలాస, సీతారామనగర్, పురుషోత్తపురం ప్రాం తాల్లో చట్టం మరియు న్యాయంపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పైల చిట్టిబాబు, లక్ష్మణరావుతో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఆక్వా సమస్య : ఎంపీ రామ్మోహన్‌నాయుడు

విశాలాంధ్ర - సోంపేట : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి ఆక్వా రైతాంగ సమస్యలు తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లు పేర్కొన్నారు. ఈ మండలం ఉప్పలాం పరిసర గ్రామాలకు చెందిన ఆక్వా రైతులతో సోమవారం ఉప్పలాం గ్రామంలో సమావేశమయ్యారు. ముందుగా ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపి, ఎమ్మెల్యేలకు వివరించారు. మార్కెట్‌లో రొయ్యి ధర గణనీయంగా తగ్గి పోయిందని, దిగుబడులు తగ్గాయని వాపో యారు. లాభాలు సంగతి అటుంచి పెట్టు బడులు కూడా సరిగా రావడం లేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో రొయ్యలసాగు ద్వారా వివరీతంగా నష్టాలపాలై లబోదిబోమనాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎటువంటి ఆసరా, భరోసా ఆక్వా రైతాంగానికి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మె ల్యేలు మాట్లాడుతూ ఇటువంటి పరిస్థి తుల్లో ఆక్వాను వ్యవసాయరంగంలో ఒక ప్రధానమైన అంశంగా భావించి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాయితీలు ఇవ్వడం, నష్టపరిహారం చెల్లించడం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి సందర్భాల్లో స్పందించకుండా మౌనం దాల్చడం దురదృష్ట కరమని అన్నారు. ఏ రంగానికి ప్రభుత్వం న్యాయం చేసే పరిస్థితి లేదని అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభు త్వాలు గాలికొది లేసాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆక్వా రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బట్టి మాధవ రావు, మండల టీడీపీ అధ్యక్షుడు మద్దిల నాగేశ్వర రావు, మాజీ ఎంపిపి చిత్రాడ శ్రీనివాస్, జెడ్పీటిసి సూరాడ చంద్రమోహన్, వంక మాధవరావు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులోకి న్యాయ సేవలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : న్యాయ సేవాది , కారి సంస్థ సేవలు అందరికీ అందు బాటులో తెస్తున్నా మని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసి నాయుడు తెలిపారు. డా. బిఆర్ అంబేద్కర్ యూని వర్సిటీలో న్యాయ శాస్త్ర విద్యార్థులతో సోమ వారం చట్టా లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి పల్లెకు కూడా ఈ సేవలు అందించా లన్నారు జిల్లా న్యాయాధికార సంస్థ అందిస్తున్న సేవలను వివ రించారు. ఈ సేవలను మరింత విస్తరించేలా న్యాయ శాస్త్ర విద్యార్థులు సామాజిక బాధ్యత వహించా లన్నారు. బాలివివాహాల పట్ల అనర్ధాలను వివరిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్ పట్నాయక్, వర్సిటీ ఆర్ట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.రమణమూర్తి, సామాజిక కార్యకర్త డాక్టర్ మంత్రి వెంకటస్వామి వర్సిటీ న్యాయవిభాగం అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే కళావతి

విశాలాంధ్ర - భామిని : మణిగ గ్రామ పంచాయతీ లో సర్పంచ్ కొండగొర్రి మంగ అధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విశ్వాస రాయి కళావతి హాజరయ్యారు. ఎమ్మెల్యేకు ఆదివాసీలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మనిగ, సీమల గూడ, రాతులగూడ గ్రామాలలో ప్రతీ గడపకు వెళ్లి ప్రజలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి అందిన సంక్షేమ పథకాలు గురించి, అలాగే ప్రజలకు గ్రామాల్లో ఉన్న సమస్యల పై గిరిజనులకు నేరుగా అడిగి తెలుసుకున్నారు. గతంలో ప్రతిపక్ష నాయకుడిగా వున్నప్పుడు జగనన్న ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను, ఎన్నికల మ్యానిఫేస్టో లో పెట్టిన నవరత్నాల సంక్షేమ పథకాలు 100 కి 100శాతం నెరవేర్చి ఈరోజు దేశంలోనే మిగతా రాష్ట్రాలకు ఆదర్శం గా వైయస్.జగన్మోహన్ రెడ్డి నిలిచారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమం లో వైస్ ఎం.పి.పి బోనగద్ది ధర్మారావు, తోట సింహాచలం, కొత్త కోట చంద్రశేఖర్, కొండగొర్రి చంటి, మజ్జి జగదీష్, వలురౌతు రామారావు, సచివాలయ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

రమేష్‌కుమార్‌కు తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర - సోంపేట : కొద్ది రోజుల క్రితం సోంపేట తహశీల్దార్‌గా విధుల్లో చేరిన మీనాకుమారి వారం రోజులు తిరక్కముందే దీర్ఘకాలిక సెలవు తీసుకోవడంతో ఆ స్థానంలో డిప్యూటీ తహశీల్దార్‌కు విధులు నిర్వహిస్తున్న ఎన్.రమేష్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

'స్పందన' అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి : ఎస్పీ రాధిక

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : 'స్పందన' కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించటంలో జాప్యం ఉండరాదని, అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఎస్పీ తోపాటు అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేదేకు నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో 41 మంది ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాది దారులు తమ తమ అభ్యర్థనలను వ్రాతపూర్వకంగా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులకు పిర్యాదుదారుల వివరాలు, వారి సమస్యలను తెలియపరచి, తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పిర్యాదులుపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలపై కూడా, తనకు ఎప్పటికప్పుడు నివేదిక అందించవలసిందిగా అధికారులకు ఎస్పీ ఆదేశించారు.

పరిపాలన సౌలభ్యం కోసం వనరులు సమకూర్చండి

విశాలాంధ్ర - పాలకొండ : పరి పాలన సౌలభ్యం కోసం వనరులను సమ కూ ర్చాలని వీఆర్ వోల సంఘం సోమవారం రెవెన్యూ డివిజన్ సబ్‌కలెక్టర్ నురూల్ కమర్ ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ దృష్టికి భూ సర్వే జరుగుతున్న దృష్ట్యా, అలాగే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే కంప్యూటర్‌లు ఆన్‌లైన్ వ్యవస్థ, డిజిటలైజేషన్‌కు సంబంధించి అన్ని వనరులను సచివాలయ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని విజ్ఞాపన పత్రం అందించారు. అందుకు స్పందించిన సబ్ కలెక్టర్ పరిశీలన చేసి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. వినతి పత్రం ఇచ్చినవారిలో బి.రాజా, బి.సాయి ఉన్నారు.

యువజన కాంగ్రెస్ ఎన్నికల సన్నాహం

విశాలాంధ్ర - శ్రీకాకుళం కలెక్టరేట్ : డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి ఆధ్వర్యంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ అధ్యక్షతన సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి జోనల్ రిటర్నింగ్ అధికారి ఎస్ పునీత్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ దేశంలో ఎంతో బలంగా ఉందని, రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జరుగుతున్న భారత్ జోడో యాత్రలో యువత ముఖ్య పాత్ర వహిస్తుందని ఈ సంద ర్భంగా తెలియ జేశారు. రానున్న రోజుల్లో యువజన కాంగ్రెస్ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఎన్నికలు నిర్వ హించడం జరుగు తుందని ఇది ఏ విధంగా నిర్వహించాలనే దానిపై ఆయన యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు వివరించారు.

తల్లి,కూతురుపై భూకబ్జాదారులు దాడులు

విశాలాంధ్ర - మందస : మండలం హరిపురం గ్రామంలో సోమవారం దారుణ ఘటన చోటు చేసుకుంది. తల్లి, కూతుర్లుపై భూ ఆక్రమణదారులు ట్రాక్టరుతో కంకర వేసి కప్పేశారు. దీనిని గమనించిన స్థానికులు కంకర తొలగించి వారిని కాపాడారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2019 నుంచి కొర్ర దాలమ్మ, మజ్జి సావిత్రిలు భూ విషయమై పోరాటం చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కొర్ర రామారావు, ఆనందరావు, ప్రకాశరావులు మజ్జి సావిత్రికు చెందిన స్థలం కబ్జాకు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. భూముల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో విచ్చలవిడిగా భూ కబ్జాలకు తెర లేపుతున్నారు. గతంలో కూడా కేవలం సెంటిభూమి కోసం వృద్ధులని చూడకుండా దాడి చేసిన ఘటన హరిపురంలోనే చోటు చేసుకుంది. ఈ సంఘటన మరవక ముందే మళ్లీ భూ వివాదం తలెత్తింది. తల్లి కూతురులను కడ చేర్చేందుకు నిర్ణయం తీసుకున్న భూ కబ్జాదారులు స్థలం వద్దే హత్యయత్నానికి పాల్పడ్డారు. ఇద్దరి మహిళలపై ట్రాక్టరుతో కంకర వేసి చంపబోయారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇంటి స్థలం కోసం పోరాటం చేస్తున్నారు. 2019లో తల్లి కూతుర్లు ఇద్దరు తమకు న్యాయం చేయాలని నిరహార దీక్షలు కూడా చేపట్టారు. భూ కబ్జాదారుల నుంచి తమకు అధికారులు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పట్టభద్రులకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - బూర్జ : మండలంలోని సంత కొల్లివలస, సెంటర్లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకున్న పట్టభద్రులందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు ప్రముఖ వైసీపీ నాయకులు చింతాడ రవికుమార్. ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గం నాలుగు మండలాలలో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారంతో నమోదు గడువు ముగియడంతో నియోజకవర్గంలో తను ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకున్న ప్రతీ పట్టభద్రుడికీ ధన్యవాదాలు తెలియజేశారు. అనివార్య కారణాలతో నమోదు చేసుకోనివారు ఎవైనా ఉంటే ఇరవై మూడో తేదీ తరువాత ప్రభుత్వం అవకాసం కల్పిస్తుందని అన్నారు. కల్పించిన అనంతరం ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, సాధారణ ఓటరు ఐడీ జరాక్సులతో వచ్చి 9640992916, 6303904729 నెంబర్లను సంప్రదించి నమోదు చేసుకోవాలని అన్నారు.

సుడి దోమ నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర - మెళియాపుట్టి : వరి పొలాల్లో సుడి దోమ అక్కడక్కడా వ్యాపించి ఉందని రైతులు దోమ నివారణ యాజమాన్యం పద్ధతులు పాటించాలని వ్యవసాయధికారి దానకర్ణుడు అన్నారు. మండలంలోని కోసమాల గ్రామంలో రైతులతో కలిసి పొలాలలోని ఉన్న సుడిదోమ పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుడిదోమ మొక్క మొదల్లో ఉండి రసం పీల్చడం వలన వరి పైరు పసుపు, ఎర్రగా మారుతుందని, తదుపరి తీవ్రత పెరిగాక పొలంలో వరి మొక్కలు అక్కడక్కడ సుడులు సుడులుగా ఎండిపోతాయని, కాబట్టి రైతులు ముందుగానే మేల్కొని సరైన సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి వరి పంటను కాపాడుకోవచ్చనన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి దానకర్ణుడుతో పాటు శరత్ కుమార్ రెడ్డి, యమున పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరాలయం మూసివేత

విశాలాంధ్ర - జలుమూరు : చంద్రగ్ర హణం సందర్భంగా నేడు మంగళవారం దక్షిణ కాశి శ్రీముఖలింగేశ్వర ఆలయాన్ని ఉదయం 11 గంటలకు మూసివేసి మర్నాడు ఉదయం ఐదు గంటలకు ఆలయాన్ని తెరవబడుతుందని, తదుపరి సుప్రభాతం సంప్రోక్షణ తర్వాత భక్తులకు ప్రవేశం కల్పించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు నాయుడు గారి రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

కనుల పండువగా కార్తీక దీపారాధన

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని కే కొత్తూరు భారతీయ విద్యా కేంద్రం వారి అర్ష విజ్ఞాన భారతి పాఠశాలలో కార్తీక పూర్ణమి సందర్భంగా దీపారాధన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆదివారం పాఠశాల ఆవరణంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శివలింగం ఆకృతిలో దీపాలు ఏర్పాటు చేసి విద్యార్థులు దీపాలంకరణ చేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ వి రామారావు కార్తీక మాసం ప్రాముఖ్యతను గూర్చి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఆచార్యులు ఎం అనిల్,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ 52తో ఆదివాసీలకు తీవ్ర నష్టం

విశాలాంధ్ర - టెక్కలి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వల్ల ఆదివాసీలకు తీవ్రమైనా నష్టం వాటిల్లుతుందని ఆదివాసీ సేన, ఆదివాసి గిరిజన చైతన్య వేదిక ద్వారా టెక్కలిలో అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం అర్ధనగ్న ప్రదర్శన ద్వారా ఆదివాసి సేన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 52 శ్యాముల్ ఆనంద్ ఏక సభ్య కమిషన్ వేసి బోయ, వాల్మీకి, నకిలీ బెంతు ఒరియాలను ఎస్టి జాబితాలో చేర్చాలన్న ప్రయత్నం మంచికాదన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీలు 2014,2019 ఎన్నికలో అధికార ప్రభుత్వనికి 90శాతం మద్దతుగా వున్నా ఆదివాసీలు ఎదురవుతున్న సమస్యలు రోడ్లు, త్రాగు నీరు మౌలిక సదుపాయాలు పూర్తిగా మరిచారని,ఓట్లు సీట్లు కోసం అగ్రకులాలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రయత్నం అధికార ప్రభుత్వం చేస్తుందని,2019 లో ఒడ్డి, ఒరియా (నకిలీ బెంతు ఒరియా) ఏకసభ్య జెసి శర్మ కమిషన్ వేసి 3 సంవత్సరాలు గడిచిన నివేదిక బహిర్గతం చేయకుండా నకిలీ బెంతుఒరియాలను ఎస్టి జాబితాలో చేర్చాలని ఏకైక ఉద్దేశంతో ఉందని, ఈ ప్రభుత్వం బోయ వాల్మీకి, నకిలీ బెంతు ఒరియా సుమారుగా 50 లక్షలు మంది వున్నారని, నిజమైన ఆదివాసిలు 32 లక్షలు వున్నారని, ఈ అగ్రకులాలు ఎస్టి జాబితాలో చెర్చితే ఆదివాసీలమైన మాకు అంతంతప్పదని, ఈ ప్రభుత్వంకు నమ్మినందుకు ఆదివాసీ లకు వున్నా గోచి, గుడ్డలి లాగేసుకుంటుందని గిరిజన సంక్షేమ నిధులు పూర్తిగా దారి మళ్ళించారని,ఆదివాసులు అభివృద్ధికి అడ్డుకుంటుంది ఈ ప్రభుత్వమేనని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ (గిరిజన) చైతన్య వేదిక జిల్లా కార్యదర్శి నడిపింటి. నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు జన్ని కాంతారావు, జన్ని సంజీరావు, సవర కిరణ్, ఎస్.చందు, బి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ విద్యార్థినుల ప్రతిభ

విశాలాంధ్ర - పలాస : కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎస్.ప్రియమణి, కె.జోత్స్నలు రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ప్రకాశం జిల్లా చేవూరులో జరగబోయే పోటీలకు హాజరవుతారని ప్రధానోపాధ్యాయులు చిన్నంనాయుడు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికై ప్రాతినిధ్యం వహిస్తున్న సందర్భంగా క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో జిల్లాకు పేరు తేవాలని, బహుమతులు గెలుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుబాబు, పి.డి. టి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి గ్రామానికి చెందిన ఉమ్మిరి నారాయణ మృతి చెందటంతో, ఆ కుటుంబానికి వైస్సార్ భీమా పథకంలో భాగంగా, తక్షణ ఆర్థిక సహాయం 10000 రూపాయలు, పంచాయతీ సర్పంచ్ కలింగపట్నం లక్ష్మీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా వైద్యులు, వైకాపా నాయకులు డాక్టర్ కలింగపట్నం అప్పారావు, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ బేహారా హేమావతి, వలంటీర్ కల్లూరి పాపారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుతా..

ఘనంగా కలిశెట్టి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - రణస్థలం : మండల కేంద్రంలో నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పల నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు నియోజక వర్గంలోని అన్ని మండలాల నుంచి టీడీపీ నాయకులు అభిమానులు తరలివచ్చారు. ముందుగా జన సమూహం తో తరలివచ్చిన కలి శెట్టి ఎర్రం నాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి సభావేధిక వద్దకు చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ పార్టీ నుంచి జిల్లా మొత్తం సేవలు అందించానని ఇప్పుడు నా సొంత నియోజకవర్గానికి సేవలను అంది స్తానని ప్రజల కష్టాల్లో తోడుగా నిలుస్తానని ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడుతానని అన్నారు. పార్టీ కార్యకర్తల కు అండగా ఉంటానని ప్రతీ నిత్యం జనాల్లో ఉంటూ సేవ చేస్తానని తెలిపారు. నేను పార్టీకి నిబద్ధతతో పనిచేసేవాడినని నన్ను అధిష్టానం వద్ద తప్పుగా చూపించే ప్రయత్నం చేసినా అధినాయకత్వం నమ్మబోధన్నారు. కష్ట కాలంలో ఉన్న పార్టీకి అండగా నిలవాల్సింది పోయి బురద జల్లే ప్రయత్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికష్టాలు ఎదురైన పార్టీని నమ్మి పనిచేస్తానని అవకాశం వస్తుందనే నమ్మకం ఉంద న్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైన నన్ను నమ్మి పార్టీ కోసం కష్టపడి పనిచేసేందుకు వస్తున్న మీ అందరికి కృతజ్ఞతలు అని అన్నారు. ఈ కార్య క్రమంలో ముఖ్య అతిధులు గా జిల్లా తెలుగు దేశం పార్టీ మాజీ అధ్యక్షులు చౌదరి సత్యనారాయణ మూర్తి (బాబ్జి), చీపురుపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కె. త్రిమూర్తులు రాజు, జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోళ్ల అప్పలనాయుడు, పాలకొండ మాజీ ఎంపీపీ దామోదరరావు, జి.సిగడాం మండల మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేశ్వర్లు, నాలుగు మండలాల టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కలిశెట్టి అభిమానులు పాల్గొన్నారు.

ఉమామల్లేశ్వరస్వామి ఆలయంలో ఉచిత దర్శనం ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మండల కేంద్రంలో ఉన్న ఉమా మల్లేశ్వరస్వామి ఆలయం ప్రభుత్వ ఆదీనంలో ఉందికనుక ఆలయానికి దర్శించుకొనేందుకు వచ్చిన పేదలను దృష్టిలో పెట్టుకొని ఉచిత దర్శన ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా పిల్లలతో కలిసి ఆలయానికి దర్శించుకోవటానికి వస్తే ఒకొక్కరి వద్దనుంచి రూ. 5, రూ, 50లు టిక్కెట్లు పెట్టి చిన్నపిల్లలు, వృద్దులు అని చూడకుండా దేవాదాయశాఖవారు వసూళ్ళు చేస్తున్నారని పలువురు ఆరోపించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఏ ఆలయంలో నైనా ఉచిత దర్శినాలు ఉంటాయని కాని ఇక్కడ మాత్రం టిక్కెటు తీస్తే

తప్ప దేవాదాయశాఖ సిబ్బంది దర్శనభాగ్యం కలించటం లేదని పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తు న్నాయి. అలాగే ఉమామల్లేశ్వరస్వామి ఆలయం పురాతన కాలం నుంచి ఉన్నది కనుక చుట్టూ పక్కల గ్రామాల్లో ఎన్ని శివాలయాలు ఉన్నప్పటికి ఈ ఆలయానికే కార్తీక మాసంలో భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారు. ఈ విషయం స్థానిక దేవాదాయశాఖ అధికారులకు, సిబ్బందికి తెలిసినప్పటికీ అటు పోలీస్‌శాఖ సహాయం కోరలేదు, అలాగే దేవాదాయశాఖకు సంబందించి ఎక్కువ మంది సిబ్బందికి పెట్టకుండా ఇద్దరికి మాత్రమే పెట్టారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో క్యూలైన్లుల్లో గంటల సమయం ఉండాల్సి వచ్చిందని భక్తులు ఆరోపించారు. ఇక మండలంలో గల కురుడు, దంత, నిమ్మాడ, లఖందిడ్డి, యలమంచిలి, కొత్తపల్లి, కొత్తపేట శివకేశవ పంచాయతన ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. అలాగే కార్తీక శుద్ద సోమవారం, నోములు సందర్భంగా కోట బొమ్మాళిలో గల కొత్తమ్మతల్లి, లక్ష్మినర్సింహా, సంతోషి మాత, శ్రీరామమందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతీయస్థాయి పోటీలకు బారువ విద్యార్థి

విశాలాంధ్ర - సోంపేట : ఇటీవల రాష్ట్రస్థాయి షార్ట్‌పుట్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన బారువకు చెందిన ఐడే కృష్ణ జాతీయ స్థాయి షార్ట్‌పుట్ పోటీలకు ఎంపికయ్యాడు. గౌహతిలో ఈ నెల 11 నుంచి 15 వరకు జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు కోచ్ బైపల్లి మారుతీ తెలియజేశారు. ఈ విద్యార్థి ప్రతిభ పట్ల బారువ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన సమస్యలు పరిష్కరించాలి

టీడీపీ పాలకొండ నించార్జ్ నిమ్మక జయకృష్ణ

విశాలాంధ్ర - సీతంపేట : మండల కేంద్రంలో సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి ఐటిడిఏ వరకు గిరిజన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు, గిరిజన సంఘం నాయకులు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ పాలకొండ ఇన్ ఛార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో గిరిజన సమస్యలపై ఐటిడిఏ ఏపీఓ రోసి రెడ్డికి వినతిపత్రం అందించారు, బోయ, వాల్మీకి, బెంతువరియాలు, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో కలపవద్దని, ఆనంద్ శామ్యూల్ కమిటీ జీవో నెంబర్ 52 రద్దు చేయాలని కోరారు. సవర భాషా వాలంటీరును తక్షణమే రెన్యూవల్ చేయాలని వారికి పెండింగ్ జీతాలు అందించాలని తెలిపారు, జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలని కోరారు, ఐటిడిఏలో స్పెషల్ డిఎస్సి నిర్వహించాలని, నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ గ్రామాల్లో చేర్చాలని, మారుమూల గిరిజన ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు, ట్రైకార్ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు లోన్లు అందించాలని, అటవీ హక్కు పత్రాలు అర్హులైన గిరిజన అందరికీ ఇవ్వాలని, ఏనుగులు వలన నష్టపోయినటువంటి గిరిజన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్నేన అప్పలనాయుడు, బిడ్డిక చంద్రావు,సవర తోట ముఖలింగం, నిమ్మక నాగేశ్వరరావు,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష తులసి దళార్చన పూజలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలంలోని కేశవరావుపేట పంచాయతీ లక్ష్ముడు పేట గ్రామంలోని శ్రీ కోదండ రామాలయంలో సోమవారం లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మెట్ట భూపాలరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భాస్కర్ నాయక్ మృతికి బార్ అసోసియేషన్ నివాళి

విశాలాంధ్ర - సోంపేట : సీనియర్ న్యాయవాది, సీనియర్ కాంగ్రెస్ నేత కంచిలి మండలం ఎంఎస్‌పల్లి గ్రామానికి చెందిన భాస్కర్ నాయక్ ఇటీవల మృతి చెందడంతో ఆయనకు సోంపేట బార్ అసోసియేషన్ సోమవారం సమావేశమై ఘనంగా నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో భాస్కర్ నాయక్ సేవలను కొనియాడారు.

13న వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికలు

విశాలాంధ్ర - ఆమదాలవలస : నవంబర్ 26 నుంచి 28 వరకు గుంటూరు నాగార్జున స్పోర్ట్స్ సెంటర్లో జరుగు జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ బాలురు బాలికలు, పురుషులు మహిళలు వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీల అభ్యర్థుల ఎంపిక కోసం 13వ తేదీ ఆదివారం 9 గంటలకు శ్రీ మారుతి వ్యాయామం నందు ఎంపికలు జరుగునని కార్యదర్శి కొత్తకోట శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు స్టేట్ అసోసియేషన్ నందు రిజిస్టర్ చేయించుకున్న ఐడి కార్డు ఉన్నవారు అర్హులని తెలిపారు. మూడు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డ్, విద్యా అర్హతల ధ్రువీకరణ పత్రాలతో ఆరోజు హాజరుకావాలని కోరారు.

కోటేశ్వరస్వామిని దర్శించుకున్న సూర దంపతులు

విశాలాంధ్ర - అరసవల్లి : నగరంలోని గుడివీధిలో ఉన్న ఉమారుద్ర కోటేశ్వరస్వామిని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధి.నేత, ప్రముఖ వ్యాపారవేత్త సూర శ్రీనివాసరావు దర్శించు కున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని ఇస్తు ఆశీర్వచనం చేశారు. ఒక్కరికీ మంచి జరగాలని ఆ ఉమారుద్రునికి పూజలు నిర్వహించినట్టు శ్రీనివాసరావు తెలిపారు.

పోలు మహంతికి పితృవియోగం

విశాలాంధ్ర - అరసవల్లి : రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ పోలుమహంతి జగన్మోహనరావుకు పితృ వియోగం కలిగింది. జగన్మోహనరావు తండ్రి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ నర్సింగ్‌రావు ఆదివారం సాయంత్రం కన్నుమూసారు నర్సింగరావు భౌతికకాయానికి పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, శిష్టకరణ సంఘ ప్రతినిధులు సోమవారం పూల మాలలు ఉంచి అంజలి ఘటించారు. నివాళులర్పించినవారిలో శిష్టకరణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమా మహేశ్వరరావు, ఆలిండియా శిష్టకరణ సంఘం కార్యనిర్వహక కార్య దర్శి, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, జిల్లా అధ్య క్షుడు బలివాడ మల్లేశ్వరరావు, శ్రీకూర్మం దేవస్థానం సభ్యుడు డబ్బీరు శ్రీనివాసరావు, ఓబీసీ కన్వీనర్ సింహగిరి పట్నాయక్ తదితరులున్నారు.

పలు పాఠశాలలను ఎంపీడీవో గీతాంజలి తనిఖీ

విశాలాంధ్ర - సీతంపేట : మండలం జగతి పల్లి మరియు రుక్మినిగూడ పాఠశాలలును సోమవారం ఎంపీడీవో గీతాంజలి సడన్ విజిట్ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మధ్యాహ్నం భోజన పథకం సక్రమంగా అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దిలీప్ కుమార్, సర్పంచ్ పాల్గొన్నారు.

జీవో 52ను రద్దు చేయాలని వినతి

విశాలాంధ్ర - మందస : రాష్ట్రంలో వెనుకబడిన కొన్ని కులాలను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం జీవో నెం.52 తీసుకొచ్చిందని, వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం మందస తహశీల్దార్ బి.పాపారావు, ఎంపిడివో తిరుమలరావులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి సవర చంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 52ను రద్దు చేసి ఆదివాసీలకు న్యాయం చేయాలని, కొన్ని కులాలైన బోయ, వాల్మీకి, బెంతు ఒరియా, మత్స్యకారులను ఎస్.టి జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం కమిటీ వేసినట్లు తమకు సమాచారం వచ్చిందని తెలిపారు. దీనివలన గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, జె.సి.శర్మ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలక్రిష్ణ, డొంబురు, నీలకంఠం, రాములు పాల్గొన్నారు.

విద్యార్థులను పేడాడ రామ్మోహన్ పరామర్శ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ కాలేజీలో ఫుడ్ పాయిజన్ జరిగి సుమారు 200 మంది విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. విద్యార్థులను స్థానిక రిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక జనసేన జిల్లా నాయకులు పేడాడ రామ్మోహన్ రావు హాస్పిటల్ కి చేరుకొని అనారోగ్యం పాలైన విద్యార్థులను పరామర్శించారు. అనంతరం సంఘటన గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అలాగే వైద్యులను విద్యార్థులకు నాణ్యమైన చికిత్సను అందజేయాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఫుడ్ పాయిజన్ జరిగిందని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సూచించారు.

260 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : జాతీయ అంధత్వ మరియు దృష్టిలోపం నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అందత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం ఆధ్వర్యంలో సంతబొమ్మాలి మండలం ఆకాశలక్కవరం, యామల పేట ప్రాథమికోన్నత పాఠశాలలో 260 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామని నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ కోదండరావు తెలియజేశారు. ఈ శిబిరంలో ఆప్తాల్మిక్ అధికారి ఎం ఆర్ కే దాస్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపంవున్న 8 మందిని గుర్తించి ఉచిత కళ్లద్దాలకు సిఫారసు చేశారు. నలుగురు విద్యార్థులను టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేశారు. విద్యార్థులకు "కంటి ఆరోగ్యం-సంరక్షణ"పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్ రమేష్, పి.హిమగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలింగపట్నంలో ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని కలింగపట్నం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఏపీ శాక్స్ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ,నియంత్రణ సలహా మేరకు జేమ్స్ హాస్పిటల్ వైద్యులు,సిబ్బంది ఉచితంగా వైద్య పరీక్షలు,రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే ఉచితంగా 160 మందికి మందులు పంపిణీ చేశారు.115 మందికి హెచ్ఐవి పరీక్షలు కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్,లావణ్య,స్థానిక సర్పంచ్ ఊర్మిళ బిసాయి, ఎంపీటీసీ పద్మావతి సత్యం,ఉప సర్పంచ్ లండ ధర్మరాజు,జేమ్స్ హాస్పటల్ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సచివాలయం తనిఖీ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి సచివాలయాలను, ఎంపిడిఓ జి. ఉమాసుందరి మంగళవారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు,పంచాయతీ కార్యదర్శి ఢిల్లీశ్వరరావు ఉన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం మామిడిపల్లి పంచాయతీ రాజాం గ్రామంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి యలమంచి గోపాల్ (27) ఆత్మహత్యకు పాల్పడినట్లు బారువ పోలీసులు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న గోపాల్ రాజాం గ్రామానికి చెందిన దువ్వ చాందినితో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వారిద్దరి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. గ్రామపెద్దలు సమక్షంలో పలుమార్లు పంచాయతీ నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం కూడా నిర్వహించిన పెద్దల సమావేశానికి పిలిచేందుకు వెళ్లగా అప్పటికే గోపాల్ పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నట్లు తెలిసింది. ఇరుగు పొరుగు వారి సాయంతో హరిపురం పిహెచ్‌సికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. బారువ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

29 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : టెక్కలి మండలం రంగాపురం గ్రామానికి చెందిన రౌతు రామారావుపై కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి గ్రామం వద్ద దాడి చేసి 29 అక్రమ మద్యంసీసాలు పట్టుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేశామని స్థానిక ఎస్ఐ షేక్‌ఖాదర్‌భాషా సోమవారం తెలిపారు. రామారావు కొత్తపల్లి నుంచి అక్రమమద్యంను తన స్వగ్రామానికి తరలిస్తున్నాడన్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకొనగా అతని వద్ద 29 అక్రమ మద్యంసీసాలు లభించాయని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఆయన తెలిపారు.

టైరు బండిని ఢీకొన్న వ్యాన్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : తమ్మినాయుడు పేట జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున ఇసుకతో ఉన్న టైరు బండిని వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టింది. ఎచ్చర్ల ఎస్సై వి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పూడి వలస గ్రామానికి చెందిన పైడి భీమారావు అనే రైతు తన సొంత అవసరానికి టైరు బండితో ఇసుకను తీసుకువస్తుండగా తమ్మి నాయుడుపేట వద్ద విశాఖపట్నం నుంచి వస్తున్న వ్యాన్ వెనుక నుంచి అతివేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో ఎద్దు మృతి చెందగా మరో ఎద్దు గాయపడింది. టైరు బండి మొత్తం పూర్తిగా పాడయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏడుగురు పేకాటరాయుళ్ళు అరెస్టు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : ఏడుగురు పేకాట రాయుళ్ళను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ షేక్‌ఖాదర్‌భాషా తెలిపారు. సోమవారం యలమంచిలి రోడ్డులో ఉన్న జ్యూట్ మిల్లులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే పేకాట శిభిరం పై దాడిచేసి ఆటలో పాల్గొన్న ఏడుగురుకు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 4, 440లు స్వాధీనం చేసుకున్నామని ఈ మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

సామాన్యుడి కి అందుబాటులో సత్వర న్యాయం

విశాలాంధ్ర - ఆమదాలవలస : అందరికీ అందుబాటులో న్యాయవ్యవస్థ పనిచేస్తుందని స్థానిక సివిల్ జడ్జ్ ఎస్ మని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఐదవ రోజు స్థానిక మున్సిపల్ పరిధిలోని పట్టణ వీధుల్లో ఇంటింటికి న్యాయ అవగాహనపై వివరించారు. వీధులలో తిరుగుతూ మహిళలకు ఇంటి యజమానులకు న్యాయం పై అవగాహన కల్పించారు. లీగల్ అవేర్నెస్ కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన వస్తుందని న్యాయ వాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయ లక్ష్మి, సెక్రటరీ విజయ్, బొడిగి రమణ, బొడ్డేపల్లి మోహన్ రావు, కింతలి త్రినాధరావు, సీతారాం, వరం, అన్నం నాయుడు, రాజేష్, అచ్చం నాయుడు, గోవింద్, సనపల ప్రసాదరావు పాల్గొన్నారు.

పంటకు విత్తనాలు సరఫరా చేస్తాం

విశాలాంధ్ర - జలుమూరు : రైతులకు కర్బూజా పంటకు కావలసిన విత్తనాలను సరఫరా చేస్తామని, అందుకు రైతులంతా కంపెనీలో షేర్ హోల్డర్స్ గా నమోదు కావాలని హార్టికల్చర్ ఆఫీసర్ వనిత, హెచ్‌డిఎస్‌ఏ డైరెక్టర్ పివి రమణలు అన్నారు. జలుమూరు మండల కేంద్రంలో సోమవారం గంగపుత్ర వెజిటబుల్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతంలో కలెక్షన్ సెంటర్ ను నిర్మించడం ద్వారా రైతులు తమ మార్కెటింగ్ను పెంచుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పెద్దలు, మహిళా రైతులు, సంస్థ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

కాంపెక్టర్ కాదు కల్పతరువు

విశాలాంధ్ర - పాలకొండ : నగర పంచాయతీలో గత 20 రోజులు గా చెత్త సేకరించే యంత్రం(కాంపెక్టర్) మూలకు చేరింది. ఇప్పటికి 11సార్లు మరమ్మతుల పేరుతో నిధులు అధికంగా వెచ్చించి గుటకాయ స్వాహా చేశారు. దీనికారణంగా పాలకొండ పట్టణంలోని 20 వార్డుల్లో చెత్త సేకరించే యంత్రం పాడైపోవడంతో పట్టణమంతా చెత్తతో నిండిపోయి దుర్గంధ భరితంగా తయారైంది. ఏ ప్రాంతం చేసినా చెత్త విళలయతాండవం చేస్తుంది. ఇది ఏమిటని అడిగితే గ్రంధాలయంలో పాఠకుల వలే నిశ్శబ్ధంగా ఉండిపోతున్నారు. ప్రజలు ఇదే అంశంపై పలుమార్లు ఫిర్యాదులు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణపై స్థానిక రెవెన్యూ డివిజనల్, సబ్‌కలెక్టర్ నురూల్ కమర్ ఇప్పటికే పట్టణంలో అనువణువుగా 20 వార్డుల్లో పారిశుద్ధ్యంపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ నగర పంచాయతీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఒక యంత్రం పోయినంతమాత్రాన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం ప్రజలకు ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇదే అంశంపై సోమవారం విశాలాంధ్ర మున్సిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్ నాగరాజు వద్ద చరవాణీ ద్వారా ప్రస్తావన తీసుకురావడంతో దీంతో అధికారి బదులిస్తూ ఇటీవల పాలకొండ పట్టణంలో పరిశీలన చేశామని, ఈవిషయం మా దృష్టిలో ఉందని, కొత్తగా విధుల్లో చేరిన కమిషనర్ ప్రసాదరావుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

మంట కలిసిన మానవత్వం..!

- మూడు రోజులుగా పడి ఉన్న శవం - పట్టించుకోని రైల్వే అధికారి

విశాలాంధ్ర - ఆమదాలవలస : పెరుగుతున్న జన సంద్రం లో రోజు రోజు కి మానవత్వ విలువలు మృగ్యం అవుతున్నాయి. అధరా బాదరా జీవన శైలి లో మానవత్వం పూర్తిగా మంట కలిసి పోతున్నాయి. విధులు నిర్వహించాల్సిన రైల్వే అధికారులు కూడా చూసి చూడనట్టు వ్యవహరించటంతో ఈ స్వతంత్ర భారత అవని ఎటువైపు పయనిస్తుంది. ఇటువంటి ఉదాహరణలు కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. స్టేషన్ పరిధిలో మృతదేహాలను తరలించినందుకు కేంద్ర ప్రభుత్వం 5000 రూపాయలు అందిస్తుంది. సుమారు నెలలో గుర్తు తెలియని మృతదేహాలతో పాటు నిర్ధారించిన బాడీ లు కూడా సుమారు నాలుగు ఐదు ప్రమాదాలు జరుగుతుంటాయి. వీటన్నింటినీ డే డైరీలో రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది. డైరీలో నమోదైన ప్రతి మృతదేహానికి 5000 రూపాయలు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది. వివరాలు లో కి వెళితే, శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ ఆమదాలవలస రైల్వే ప్లాట్ ఫారం వద్ద ఉన్న నడక వంతెన పై గుర్తు తెలియని వ్యక్తి మూడు రోజులు గా అక్కడే పడి ఉన్నారు. శాఖలో పనిచేస్తున్న వ్యక్తుల మధ్య సమన్వయ లోపంతో ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయని దిగువ స్థాయి సిబ్బంది అంటున్నారు. రెండు రోజులు క్రితమే ఆయన మృతి చెందినేట్లు దృవీకరించు కున్న స్థానిక జీఆర్పి పోలీసులు ఆయన మీద దుప్పటి కప్పి వేసి అక్కడే ఉంచారు. కనీసం మృతదేహానికి తరలించాలన్న ఆలోచన కూడా పోలీసులు చేయలేదు. మానవత్వం మరుగున పడిపోయిందని రైల్వే ప్రయాణి కులు వాపోతున్నారు. రైల్వే స్టేషన్ లో పడి ఉన్న మృతదేహంతో ఇప్పటికే దుర్వాసన వస్తున్న పోలీసులు కనీస చర్యలు చేపట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

స్టేషన్ మేనేజర్ లెటర్ ఇవ్వలేదని జీఆర్పి తప్పించుకుంటుంది. అదే తెలిసిన శవం లభిస్తే కట్టలు కట్టలు గా వరుగులు పెట్టి, దర్యాప్తు లు మీద దర్యాప్తు లు నిర్వహించి, కుటుంబ సభ్యులు వద్ద డబ్బులు వసూలు చేసే పోలీసులు అనాథ శవం కావడం తో కనీస చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇటీవలే దాండరాసి మెట్ట వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం కావడంతో ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడు తదితరాలను గుట్టు చప్పుడు కాకుండా నొక్కేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాల్సిన ఉంది. ఇప్పటికైనా రైల్వే ఉన్నత అధికారులు చర్యలు చేపట్టి మంట కలుస్తున్న మానవత్వాన్ని కాపాడాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - మందస : ఖరీఫ్ కాలంనకు సంబంధించి వరి కోతలు సమీపిస్తున్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు కల్లాల్లో ప్రభుత్వం ధరల మేరకే కొని దళారుల బారి నుంచి రైతులను కావాలని రైతు సంఘం నాయకులు బెస్తా కామేశ్వరరావు, నల్ల హడ్డి, మామిడి మాధవరావులు అన్నారు. సోమవారం హరిపురంలో రైతు సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు కొత్త వ్యాధులు వస్తున్నాయని, ప్రభుత్వం ఉచితంగా వైద్యసేవలు అందించాలన్నారు. 90శాతం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేయాలని, అలాగే అగ్రికల్చర్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వలన మందస, ఉద్దాన ప్రాంతంలో చాలా వరకు రైతులు నష్టపోయారని, కొత్త అధికారిని నియమించాలని కోరారు. కిడ్నీ పరిశోధనకు ప్రభుత్వం 50లక్షల రూపాయలు మంజూరు చేసిందని, ఉద్దానం, వల్లపు గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో మజ్జి బాబూరావు, కొర్ల హేమారావుచౌదరి, ముకుందరావు, సోమనాధం, వీరాస్వామిలు పాల్గొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రంను పలాస ఆర్డీవో సీతారామ్మూర్తి, తహశీల్దార్ పాపారావులకు అందజేశారు.

కందిరీగల దాడితో బెంబేలెత్తుతున్న గ్రామస్తులు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మండలంలోగల చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు గ్రామస్థులు గడిచిన మూడు రోజులుగా కందిరీగలు సుమారు 40మందిపై దాడిచేయటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వివిద పనులు కోసం పొలాలకు వెళ్ళిన రైతులకు కందిరీగలు కాటు వేయటంతో వారు స్థానిక ఆసుపత్రికి వెళ్ళి వైద్యం చేయించు కోవాల్సి వస్తుంది. సోమవారం కందిరీగలు గుంపుగా గ్రామంలోకి వచ్చి సుమారు 10 మందికి కాటువేయడంతో వారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పూర్వం కందిరీగలు చెట్టు కొమ్మలకు గూడులు కట్టుకొని ఉండేవని, వాటిని ఎవరైన కదిపితే తప్ప అవి కాటు వేసేవికాదని, కాని ఇప్పుడు ఎవరు ఏమి అనకుండానే వాటి పక్క నుంచి వెళ్ళిన కాటువేస్తున్నయన్నారు. అయితే నిన్న మొన్నటివరకు పొలాలకు వెళ్ళిన రైతులకు మాత్రమే కాటేశావని, కాని ఈ రోజు గ్రామంలో వచ్చి దొరికిన వారికి దురికినట్లు కాటువేశాయని ఇలాంటి పరిస్థితి ఎప్పుడు చూడలేదని గ్రామస్థులు వాపోతున్నారు.

21న హరిశ్చంద్రపురంలో లక్షదీపారాధన



విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మండలం చిన్న హరిశ్చంద్రపురం గ్రామం శ్రీపంచదామక్షేత్రంలో ఈనెల 21వ కార్తీక నాల్గవ సోమవారం సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు ఉప్పాడ కనకరాజు ఆధ్వర్యంలో వేద పండి తులు బంకుపల్లి సుబ్రమణ్యశర్మ ఆధ్యక్షతన లక్ష దీపా రాధన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అలాగే కార్తీక రెండోవ సోమవారం, పౌర్ణమి సందర్భంగా శ్రీపంచదామక్షేత్రంలో లక్షబిల్వార్చన మరియు మహా రుద్రాభిషేకం సోమవారం రాత్రి ఘనంగా నిర్వ హించారు. మండలంలో ఉన్న చుట్టూ గ్రామాల నుంచి సుమారు 10వేలు మహిళ భక్తులు లక్షబిల్వార్చనలో పాల్గొన్నారు. అలాగే లక్ష ఒక్క శివ లింగాలు ప్రతిష్టలో భాగంగా చాలా మంది భక్తులు క్షేత్ర ప్రాంగణం లో శివలింగ ప్రతిష్ఠ చేయటం జరిగింది. 4వ సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహించ నున్నట్లు ధర్మ కర్త ఉప్పాడ కనక రాజు తెలియ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపోత్సవం జయ ప్రధం చేయవలసిందిగా భక్తులుకి విన్నవించారు.

అమరజీవి కామ్రేడ్ గంటి రాజేశ్వరరావు

విశాలాంధ్ర - సోంపేట : బడుగు జీవులకు అండగా ఉంటూ వారి తరపున అనేక ఉద్యమాలు నిర్వహించి అసువులు బాసిన కామ్రేడ్ గంటి రాజేశ్వరరావు అమరజీవి అని పేర్కొన్నారు. ఆయన 70వ వర్ధంతి ఈ మండలం బారువలో సోమవారం నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకుడు పాతిన కృష్ణమూర్తి, ఐటియు నాయకుడు నరేష్ కామ్రేడ్ రాజేశ్వరరావు, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం 28 ఏళ్ళు జీవించిన కామ్రేడ్ రాజేశ్వరరావు, అతడు నడిపిన ఉద్యమాలు, సాధించిన విజయాలు ఇప్పటికీ ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దుంపల కృష్ణారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేదారేశ్వరుని పూజలు

విశాలాంధ్ర - పొందూరు : హిందువుల ఆరాధ్య దైవం కే దానాదీశ్వరుడి పూజలు కార్తీక మాస సోమవారం ఇంటింటా ఘనంగా నిర్వహించారు. మండలంలో వాడవాడలా పున్నమి నోములు పురస్కరించుకుని గ్రామాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు. సంధ్యా సమయాన్న హిందూ సాంప్రదాయ పద్ధతుల్లో భక్తులు తలంటి స్నానం ఆచరించి, భక్తిశ్రద్ధలతో ఉపవాసాలతో సన్నీ గొడ్డను బహు సుందరంగా అలంకరించి, పరమేశ్వరునికి ప్రీతికరమైన మర్రి కొమ్మలు, దుచ్చెనకొమ్మలు, మారేడు దళాలతో, నోము బూరెలు నైవేద్యంగా పెట్టి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేద పండితులు వినిపించే కార్తీకమాస వ్రతాన్ని ఆలకిస్తూ భక్తుల వేడుకుగా పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.